క్లుప్తంగా

బోరు, కాలనీ ప్రారంభం



తాగునీటి బోరును ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: రాష్ట్ర పరిస్థితుల అనుగుణంగా ప్రజలకు ఏమి కావాలో తెలుసుకుని సీఎం జగన్ మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమం అంటే ఏమిటో చేతల్లో చూపించారని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని పట్రపల్లె కొత్తూరు గ్రామ సమీపంలో నూతనం వైఎస్ రాజశేఖర్ రెడ్డి నగర్‌ను ప్రారంభించారు. అలాగే గ్రామంలో జెడ్పీ నిధులతో వేసిన తాగునీటి బోరును ప్రారంభించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చలపతి, నాయకులు నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బలగాల కవాతు



మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

పలమనేరు: పట్టణంలో 70 మంది కేంద్ర బలగాలు స్థానిక పోలీసులతో కలసి మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా పద్మశ్రీ సర్కిల్, మదనపల్లె రోడ్డు, బజారు వీధి, వైఎస్సార్ సర్కిల్, రంగాపురం మీదుగా కవాతు చేశారు. సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ, రాబోవు ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో సమస్యాత్మక ప్రాంతాల్లో ముందస్తు హెచ్చరికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు చెప్పారు. అసిస్టెంట్ కమాండెంట్ డీఎస్పీ వివేక్ బదౌరియా పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలేకు ఘన నివాళి

పలమనేరు: తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీ బాయి పూలే వర్ధంతి పురస్కరించుకుని ఆదివారం స్థానిక కళామందిరంలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి, ఆమె సేవలను ప్రస్తుతించారు. సమితి నిర్వాహకులు తులసీనాథం నాయుడు మాట్లాడుతూ, కులమతాలకతీతంగా సమాజాన్ని ప్రేమించిన సంఘ సంస్కర్త సావిత్రీబాయి అన్నారు. ఇప్పటి తరం ఆమెను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సమితి కార్యదర్శి పుష్ప, భూపాల్ రెడ్డి, హర్షిత పాల్గొన్నారు.

రొంపిచెర్ల: సావిత్రి బాయి పూలే వర్ధంతి పురస్కరించుకుని ఆదివారం స్థానిక రొంపిచెర్ల ఆర్టీసీ బస్టాండ్‌లో సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఆమె సేవలను ప్రస్తుతించారు. రాష్ట్ర బీసీ సెల్ నాయకులు నారాయణస్వామి, మండల బీసీ సెల్ అధ్యక్షుడు నూరేషా, రఘునాథ్, మల్లేపల్లె వెంకటేష్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యం

రొంపిచెర్ల: రానున్న ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యమని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి జోస్యం చెప్పారు. రొంపిచెర్లలో ఆయన స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ, జనసేన, బీజేపీ కలసి వచ్చినా వైఎస్సార్‌సీపీ గెలుపును ఎవరూ అడ్డుకోలేరన్నారు. ఏపీలో మళ్లీ వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఇబ్రహీంఖాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనాథనాయుడు, అలీంఖాన్, సుధాకర్ రెడ్డి, సుబ్రమణ్యం, చిన్న నాగనాజ, లక్ష్మయ్య, సైఫుల్లాఖాన్, మహబుబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

హక్కు కల్పించింది జగనన్న ప్రభుత్వమే



హక్కు పత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

పలమనేరు: ప్రభుత్వం మంజూరు చేసిన శాశ్వత గృహ నిర్మాణాలపై మహిళలకు యాజమాన్య హక్కు కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని పలమనేరు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు రంగన్న, మురళీకృష్ణ తెలిపారు. మండలంలోని టి.వడ్డూరులో 81మందికి, పట్టణంలోని 20, 21 వార్డుల్లో 236 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ కన్వేయన్స్ డీడ్స్‌ను ఆదివారం పంపిణీ చేసి వారు మాట్లాడారు. కార్యక్రమంలో టి.వడ్డూరు సర్పంచ్ మునస్వామి, కౌన్సిలర్లు ఎస్టీ మురళీకృష్ణ, పవిత్ర, సచివాలయ కన్వీనర్ గోపాల్ రెడ్డి, నాయకులు షరీఫ్, హరి, రామక్రిష్ణ, చక్రవర్తి, పంచాయతీ కార్యదర్శి సాయి బంగారు, వీఆర్వో గోవిందు తదితరులు పాల్గొన్నారు.

13న షాదీమహల్ ప్రారంభం

పుంగనూరు: పట్టణంలో రూ.25 లక్షలతో నిర్మించిన అంజుమన్ షాదీమహల్‌ను ఈనెల 13న మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్టు నాయకులు తెలిపారు. ఆదివారం అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఎంఎస్.సలీం, రాష్ట్ర జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, సీమ జిల్లాల మైనారిటీ సెల్ ఇన్‌చార్జ్ ఫకృద్దీన్ షరీఫ్, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ముతో కలసి కమిటీ సమావేశం నిర్వహించారు.

చంద్రబాబుది మూడు ఊతకర్రల ప్రయాణం



సభకు హాజరైన మహిళలు



బైరెడ్డిపల్లెలో ఆసరా మెగా చెక్కును పంపిణీ చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

- అప్పట్లో మోదీని తిట్టి.. ఇప్పుడు బాబు కాళ్లబేరం
- ఓటమి భయంతోనే పొత్తులు
- వైఎస్సార్‌సీపీ ఒంటరిగానే పోటీలో సిద్ధం
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



రోడ్ల పనులను ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

బైరెడ్డిపల్లె/పలమనేరు: చంద్రబాబుది మూడు ఊతకర్రల ప్రయాణమని, నేరుగే గెలిచే సత్తా లేక జనసేన, బీజేపీలతో పొత్తులు పెట్టుకుని వారి సాయంతోనైనా గెలవాలనికుంటున్నాడని సైన్స్‌అండ్ టెక్నాలజీ, అటవీ, పర్యావరణశాఖ, భూగర్భగనుల శాఖమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అపహాస్యం చేశారు. కానీ తమ నేత సింగిల్‌గానే ప్రజల ఆశీస్సులతో వచ్చి తన సత్తా చేమిటో చూపిస్తారన్నారు. ఆదివారం ఆయన పలమనేరు నియోజకవర్గం బైరెడ్డిపల్లె మండల కేంద్రంలో రూ.28కోట్లతో వేసిన మూడు రహదారులను (బైరెడ్డిపల్లె-పుంగనూరు రహదారి, దేవదొడ్డి-లక్కనపల్లె వయా తీర్థం, దాసార్లపల్లె రహదారి విస్తరణ, మురారిపల్లెకు రహదారి) ప్రారంభించారు. ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప అధ్యక్షతన నిర్వహించిన సభలో 3,972మంది లబ్ధిదారులకు రూ.7.44కోట్ల వైఎస్సార్ చేయూత నాలుగో విడత చెక్కును, 1,056 మందికి రూ.9.62 కోట్ల వైఎస్సార్ ఆసరా మెగా చెక్కులను ప్రజాప్రతినిధులతో కలసి పంపిణీ చేశారు. తొలుత లబ్ధిదారులతో కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మంత్రి మాట్లాడుతూ, ఓటమి భయంతో చంద్రబాబునాయుడు మూడురోజులుగా ఢిల్లీ పెద్దల వద్దకు కాళ్లబేరానికి వెళ్లి పొత్తులు పెట్టుకున్నారని అపహాస్యం చేశారు. ఎన్ని పార్టీలు ఏకమై వచ్చినా వైఎస్సార్ సీపీని ఏమీ చేయలేరని, ప్రజలంతా సంక్షేమ పాలన అందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ ముఖ్యమంత్రి చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. దేశంలో ఏ రాష్ట్రమూ చేయనంత అభివృద్ధి జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ఇక్కడ చేశామన్నారు. తమ నాయకుడికి ప్రజాబలం ఉండడంతో ఆయన ఎన్నికలకు సింగిల్‌గా వస్తున్నారన్నారన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలతో ఏపీ మరో శ్రీలంక అవుతుందంటూ గోబెల్స్ ప్రచారం చేసిన టీడీపీ ఇప్పుడు సూపర్‌సిక్స్ పథకాలకు రూ.2.50 లక్షల కోట్లను ఎలా ఇస్తుందని, అప్పుడు రాష్ట్రం ఏమవుతుందని సూటిగా ప్రశ్నించారు. గతంలో చంద్రబాబు ఇచ్చిన 600 హామీలను అమలు చేయలేదని, ఈసారి కూడా ఎన్ని దొంగ హామీలిచ్చినా ప్రజలు చంద్రబాబును నమ్మరాదని విజ్ఞప్తి చేశారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు.

ఏమార్చే హామీలను నమ్మొద్దు: ఎంపీ

ఎంపీ ఎన్ రెడ్డెప్ప మాట్లాడుతూ, ఎన్నికలు సమీపించడంతో చంద్రబాబు నాయుడు ఆచరణకు సాధ్యం కాని హామీలు గుప్పిస్తూ ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నాడన్నారు. ఇప్పుడు పొత్తుల రూపంలో కొత్తగా హామీలు వండి వార్చే పనిలో పడ్డారని ఎద్దేవా చేశారు.

కరోనా కష్టకాలంలో టీడీపీ నేతలెక్కడ?: రెడ్డెమ్మ

కరోనా కష్టకాలంలో టీడీపీ నాయకులు, మాజీ మంత్రి ప్రజలకు ముఖం చాటేశారని, అప్పుడు పత్తా లేని వాళ్లంతా ఇప్పుడు ఎన్నికల సమీపించడంతో వస్తున్నారని దుయ్యబట్టారు. జగనన్నకు ఉన్న ప్రజాబలాన్ని చూసి ఎలాగూ గెలవలేమనే చంద్రబాబు పొత్తులు పెట్టుకున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఉడా చైర్మన్ వెంకటరెడ్డియాదవ్, టీటీడీ బోర్డు మాజీ సభ్యులు పోకల అశోక్, రాజంపేట ఎన్నికల పరిశీలకులు బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి, చలపతిరెడ్డి, వైస్ ఎంపీపీలు రూప, నారాయణస్వామి, సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీడీఓ రాజేష్, ఈఓపీఆర్‌డీ రాజేంద్రబాలాజి, ఏపీఓ లలిత, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

ఒక్కసారి మీ బ్యాంకు స్టేట్‌మెంట్లు చూడండి : ఎమ్మెల్యే

ఎమ్మెల్యే వెంకటేగౌడ మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో మీ బ్యాంకు ఖాతాలో పడిన నగదు, జగనన్న పాలనలో వచ్చిన డబ్బు లెక్కలను చూస్తే మీకు ఎవరేమి చేశారో తెలుస్తుందన్నారు. నియోజవర్గంలో జరిగిన అభివృద్ధి టీడీపీ నాయకుల కళ్లకు కనిపించకుంటే వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా కంటి ఆపరేషన్ చేయించుకుని ఆ తర్వాతైనా గ్రామాలోకి వెళ్లి చూడాలని వ్యంగ్యంగా అన్నారు. మండలంలో కొత్తగా 15 చోట్ల వేసిన రోడ్లను వివరించారు. గత టీడీపీ హయాంలో పంచాయతీకి మూడు ఇళ్లు ఇస్తే తాము 15వేల ఇళ్లనిచ్చామన్నారు.ఇన్నాళ్లు గ్రామాల్లోకి రాని మాజీ మంత్రి అమరనాథ రెడ్డి ఎన్నికల కోసం వచ్చి ఏమార్చే మాటలు చెబుతున్నాడని, జనం ఆయన్ని నిలదీయాలని కోరారు.

12న 'డయల్ యువర్ డీఎం'

పలమనేరు: పలమనేరు ఆర్టీసీ డిపోలో ఈనెల 12న డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు డీఎం టీకే స్వామి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల దాకా ఈ కార్యక్రమం నిర్వహిస్తామని, డిపో పరిధిలో ఏవైనా సమస్యలు ఉన్నపక్షంలో ప్రయాణికులు 995925678 సెల్ నంబర్‌కు ఫోన్ చేసి తమ దృష్టికి తెస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

భగవద్గీతపై ప్రచారం

పలమనేరు: భగవద్గీత పారాయణం చేయడం పిల్లలకు చిన్నతనం నుంచే నేర్పాలని స్థానిక త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రబోధ సేవాసమితి నిర్వాహకులు భాస్కర్ కోరారు. మున్సిపాలిటీలోని బొమ్మిదొడ్డిలో గీతపై ఇంటింటా ప్రచారం చేశారు. భగవద్గీత గ్రంథాలను ఉచితంగా పంపిణీ చేశారు. బాలాజి, వాణీశ్రీ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై హత్యాయత్నం

పులిచెర్ల(కల్లూరు): హత్యాయత్నానికి పాల్పడటంపై కేసు నమోదు చేసినట్లు కల్లూరు ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డి ఆదివారం తెలిపారు. వివరాలు..మండలంలోని కొత్తపేటకు చెందిన మహమ్మద్ షరీఫ్‌కు షేక్ బారేషాకు మధ్య శనివారం చిన్న గొడవ చోటుచేసుకుంది. దీనంతో బారేషాను మహమ్మద్ షరీఫ్ చాకుతో కడుపుపై రెండు చోట్ల పొడవడంతో గాయాలయ్యాయి. గాయపడిన బారేషాను చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు తిరుపతి హాస్పిటల్‌కు చేరుకుని జరిగిన సంఘటనపై ఆరా తీశారు. కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న నిందితుని కోసం గాలిస్తున్నామని, ప్రస్తుతం బారేషా కోలుకుంటున్నట్లు ఎస్ఐ చెప్పారు.

ఓట్లు అడిగేందుకు ధైర్యంగా ప్రజల్లోకి..



మహిళలకు మెగా చెక్కు పంపిణీ చేస్తున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్సీ, పలమనేరు ఎమ్మెల్యే

- అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో మంత్రి పెద్ది రామచంద్రారెడ్డి



మున్సిపల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి

కుప్పం: తాము గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలనీ నెరవేర్చాం కాబట్టే ఎన్నికల్లో ఓట్లు అడిగేందుకు ధైర్యంగా వెళ్తున్నామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. కుప్పంలో రూ.5 కోట్లతో నిర్మించిన మున్సిపల్ కార్యాలయం, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనం, రాజన్న క్యాంటీన్, చెరువు కట్టపై నూతనంగా నిర్మించిన ఫెన్సింగ్‌ను మంత్రి ప్రారంభించారు. 2,280 మహిళా సంఘాలకు వైఎస్సార్ చేయూత పథకం కింద రూ.4.72 కోట్ల చెక్కును, మున్సిపాలిటీలోని మహిళలకు ఇళ్లపట్టాలను పంపిణీ చేశారు. అలాగే వైఎస్సార్ సీపీ ఎన్నికల కరపత్రాలను విడుదల చేశారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. కుప్పంలో సీఎం ఇచ్చిన మాటకు కట్టుబడి హంద్రీ-నీవా కాలువ పూర్తి చేసి నీళ్లు తీసుకువచ్చామని, ఇప్పటికే నియోజక వర్గంలో మూడు చెరువుల్లో నీరు నింపామన్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల చెరువులకు నీరు మళ్లించడం ఆలస్యం అవుతోందని, రాబోవు రోజుల్లో పుష్కలంగా వర్షాలు కురిస్తే పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లోని 110 చెరువులను కృష్ణా జలాలతో నింపి సస్యశ్యామలం చేస్తామన్నారు.

బాబు పాలనలో నష్టం.. వక్రరాతలు మానుకో రామోజీ

చంద్రబాబు 14 ఏళ్లు మూడు పర్యాయాలు ముఖ్యమంత్రిగా పని చేసి రాష్ట్రానికి తీరని నష్టం కలిగించారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తీవ్రంగా విమర్శించారు. చేశారు. కుప్పం ప్రజలు నాలుగు దశాబ్దాలుగా ఓట్లు వేసి గెలిపించినా వారికి ఆయన చేసింది శూన్యమన్నారు. కనీసం బాబు చరిత్రలో చెప్పుకునేందుకు ఒక్క పథకం కూడా లేదన్నారు. అలాంటి వ్యక్తి జనం ముందుకు వెళ్ళి ఏ ముఖం ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. ఇచ్చిన మాట ప్రకారం హంద్రీ-నీవా కాలువ పూర్తి చేసి కుప్పంకు నీరు తీసుకువస్తే స్వాగతించాల్సిందిపోయి రామోజీ ఓర్వలేక వక్రరాతలు రాయడం దారుణమని మండిపడ్డారు.

చేసిన మేలు చూసి ఓట్లేయండి: ఎంపీ రెడ్డెప్ప

ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో చేసిన మేలు చూసి ఓట్లు వేయాలని చిత్తూరు ఎంపీ ఎన్ రెడ్డెప్ప విజ్ఞప్తి చేశారు. వలంటీర్ల వ్యవస్థతో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూర్చామన్నారు.

మార్పు మొదలైంది..వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం తథ్యం : ఎమ్మెల్సీ భరత్

ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ, కుప్పంలో అభివృద్ధి జరగలేదని విమర్శించేవారికి కళ్లు గుడ్డిపోయిందని, ఐదు కోట్లతో నిర్మించిన మున్సిపల్ భవనం, పీఏసీఎస్ భవనాలు, గ్రామ గ్రామాన వేసిన సీసీ రోడ్లు కనబడవా? అని ప్రశ్నించారు. పట్టణంలోని విజయలక్ష్మి రోడ్డులో 14 ఏళ్లుగా ఒక్క డ్రైనేజీ కాలువ పూర్తి చేయలేకపోయారని, తమ ప్రభుత్వం వచ్చాక కాలువ పూర్తి చేశామన్నారు. జగనన్న చేసిన అభివృద్ధి, సంక్షేమం చూసి కుప్పం ప్రజల్లో మార్పు మొదలైందని, రాబోవు ఎన్నికల్లో కుప్పంలోనూ వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, రెస్కో చైర్మన్ సెంథిల్, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్, నాయకులు నరేష్‌కుమార్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వమే ప్రజలకు తోడు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్



చిన్నకడపల్లెలో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ భరత్, నాయకులు

- అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్సీ భరత్

శాంతిపురం: కరోనా అతలాకుతలం చేసిన రోజుల్లో సహా అన్ని కష్టాల్లో ప్రజలకు తోడుగా నిలిచింది ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమేనని ఎమ్మెల్సీ భరత్ పునరుద్ఘాటించారు. ఆదివారం ఆయన కడపల్లె పంచాయతీ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ భవనాలను ప్రారంభించి మాట్లాడారు. 35 ఏళ్లుగా చంద్రబాబుకు ఓటు వేస్తున్న కుప్పం ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి కనీసం ఆయనను కలువగలరా? సమస్యలు పరిష్కరించలేదని ఆయనను నిలదీయగలరా? అని ప్రశ్నించారు. సామాన్యులు ఆయన పీఏలను కలిసే అవకాశం కూడా లేదని, ఒక్క అవకాశం ఇచ్చి, వైఎస్సార్ సీపీని గెలిపిస్తే చంద్రబాబులా హైదరాబాద్‌లో కాకుండా ఇక్కడే ప్రజలకు అందుబాటులో ఉంటారని స్పష్టం చేశారు. కుప్పం ప్రజల్లో మార్పును గమనించి, స్థానిక తెలుగు తమ్ముళ్లపై నమ్మకం లేక, ఓటమి భయంతో ఇతర జిల్లాల నుంచి నాయకులను ఇక్కడికి దిగుమతి చేసుకున్నారని ఎద్దేవా చేశారు.

మళ్లీ ఊదరగొడుతున్నారు.. హామీలు నెరవేర్చని బాబు

తన పాలనలో సంక్షేమ పథకాలు అంది, మేలు జరిగిఉంటేనే తనకు ఓటు వేయాలని సీఎం జగన్ మోహన్‌రెడ్డి చెబుతుంటే 35 ఏళ్లుగా కుప్పాన్ని పాలించిన ఆయన మాత్రం ఈ పర్యాయం తమను గెలిపిస్తే ఏమేమో చేసేస్తామని మళ్లీ ఊదరగొడుతున్నారని, 2014లో ఆరు వందలకు పైగా హామీలు ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక రైతు రుణాలు, డ్వాక్రా రుణాలతో సహా ఏ హామీని నెరవేర్చిన పాపానపోలేదని, మళ్లీ ఓట్ల కోసం ఇప్పుడు ఆయన ఇస్తున్న హామీలను నమ్మితే మళ్లీ ఆయన ముంచడం తథ్యమన్నారు. ఇంత కాలం కుప్పంలో ఇల్లు కూడా లేని చంద్రబాబు రెండేళ్లుగా ఇల్లు కడుతున్నా పనులు మాత్రం పూర్తి కాలేదని, అయితే రెండు ఎకరాలలో చిన్న ఇల్లు కడుతున్నట్టు ఇటీవల నారా భువనేశ్వరి చెప్పుకొచ్చారని గుర్తు చేశారు. ప్రతిపక్షనేత ఇక్కడ ప్రాతినిధ్యం వహిస్తున్నా వివక్ష చూపకుండా తమ ప్రభుత్వం కుప్పం నియోజకవర్గంలోని 82,039 కుటుంబాలకు రూ 1,400 కోట్లు నేరుగా అందించిందన్నారు. అలాగే చేసిన అభివృద్ధిని గణాంకాలతో సహా ప్రత్యేకించి కుప్పంకు కృష్ణా జలాలను తేవడాన్ని చెప్పారు.

తారు రోడ్డు ప్రారంభం

కడపల్లె పంచాయతీ పోడుచేన్లులో రూ 1.10 కోట్లతో వేసిన తారు రోడ్డును ఎమ్మెల్సీ భరత్ ప్రారంభించారు.జెండా ఆవిష్కరణలు పోడుచేన్లు, బిఎం గొల్లపల్లె, కదిరివోబనపల్లె, కాలిగానూరు, చిన్న కడపల్లె, పోడూరు, మాదనపల్లె గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గ, రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, పార్టీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, వైస్ ఎంపీపీ పట్టాభి, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ చంగప్ప, స్థానిక సర్పంచ్ చిన్నపాపమ్మ, ఎంపీటీసీ ఉమాదేవి, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దొంగల ముఠా అరెస్టు

రామకుప్పం: మండలంలో తిమ్మసముద్రం కాలనీ సమీపంలో యువకుడిని బెదిరించి మోటార్ సైకిల్ చోరీ చేసిన ఏ ఆర్ కానిస్టేబుల్‌తో సహా ముగ్గురిని అరెస్టు చేసినట్లు శివకుమార్ ఆదివారం తెలిపారు. ఆయన కథనం .. మండలంలోని మిట్టపల్లెకు చెందిన ప్రవీణ్ గత నెల 28న రాజుపేట రోడ్డు నుంచి తన గ్రామానికి ద్విచక్ర వాహనంలో వస్తుండగా అతన్ని బెదిరించి ముగ్గురు ఆగంతకులు అతడిని బైక్‌తో సహా ఉడాయించారు. ఆ తర్వాత ప్రవీణ్ తన బైక్ కోసం గాలించాడు. ఈ నేపథ్యంలో తిమ్మసముద్రం సమీపంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాల వద్ద ముగ్గురు వ్యక్తులు బైక్‌లో వెళ్తుండటం తన స్నేహితులతో కలిసి గమనించిన అతడు ఆ బైక్ తనదేనని గుర్తించాడు. ఆ ముగ్గురినీ నిలువరించి బైక్‌తో సహా రామకుప్పం పోలీసులకు అప్పగించారు.

పోలీసుల విచారణలో ఏం తేలిందంటే..

ఆ ముగ్గురు నిందితులు కుప్పం మండలం అడవిబూదుగూరుకు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ గాంధీ, కొత్తపల్లెకు చెందిన సోమశేఖర్, గరిగచీనేపల్లెకు చెందిన మోహన్ అని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. గాంధీ తల్లి గత డిసెంబర్ నెలలో మృతి చెందడంతో మద్యానికి అలవాటు పడ్డాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా సులువుగా డబ్బు సంపాదించాలని సోమశేఖర్, మోహన్‌తో కలిసి చోరీకి స్కెచ్ వేశాడు. ప్రవీణ్‌ను బెదిరించి బైక్‌ను లాక్కెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం కుప్పం కోర్టులో వారిని హాజరు పరచారు.

హిందువుల ఐక్యతకే రూట్ మార్చ్

వి.కోట: హిందులంతా ఒకేతాటిపై నడిచి ఐకమత్యం చాటాలని పుట్టాశేషు అన్నారు. పట్టణంలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం వి.కోటలో రూట్‌మార్చ్ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పట్టణ ప్రముఖులు, వక్తలు ప్రసంగించారు. పాశ్చాత్యా దేశాలు మన సంస్కృతీ సంప్రదాయాలను పాటిస్తుంటే మన భారతీయులు పాశ్చాత్య దేశాల సంస్కృతి వైపు మొగ్గడం సరికాదన్నారు. దీనిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

ఘనంగా శ్మశానకొల్ల



శ్మశాన కొల్ల పూజలకు తరలి వచ్చిన భక్తులు



పట్టణంలో ఊరేగుతున్న అంగాళ పరమేశ్వరి

కుప్పం: పట్టణంలో ఆదివారం శ్మశాన కొల్ల పూజలు ఘనంగా నిర్వహించారు. కొత్తపేటలోని అంగాళ పరమేశ్వరి దేవాలయంలో అభిషేకాలు, పూజార్చనలు నిర్వహించారు. దేవాలయ ప్రాంగణం అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజల అనంతరం బైపాస్‌లోని శ్మశానం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లి అక్కడ దక్ష సంహార కార్యక్రమం నిర్వహించారు.

శివరాత్రి మరుసటి రోజు

ప్రతి ఏటా మహా శివరాత్రి మరుసటి రోజు వచ్చే అమావాస్య రోజున బెస్త కులస్తులు శ్మశాన కొల్ల పూజలు చేయడం ఆనవాయితీ. ఈ సంస్కృతీ సాంప్రదాయం తమిళనాడు రాష్ట్రం అధికంగా పాటిస్తూంటారు. తమిళనాడు సరిహద్దులో కుప్పం ప్రాంతం ఉండటంతో, ఇరు రాష్ట్రాల ప్రజలు బంధువర్గాలు కలిగి ఉండడంతో ఆ సంస్కృతి ప్రభావం ఇక్కడా ఉంటోంది. ఈ నేపథ్యంలో శ్మశానంలో అమ్మవారికి పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకుంటే దుష్టశక్తులు దూరమవుతాయని నమ్మకం ఉండడంతో అధిక సంఖ్యలో మహిళలు పూనకాలతో ఊగిపోయారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్ర ప్రజలు సైతం పెద్ద ఎత్తున తరలి వచ్చారు. శ్మశానంలో ఏర్పాటు చేసిన దక్షుడి ప్రతిమ మట్టిని తీసుకునేందుకు ప్రజలు ఎగబడ్డారు. కుప్పం శ్మశానం అంగాళపరమేశ్వరి నామ స్మరణతో మార్మోగింది.

రథోత్సవం



పుంగనూరు: మండలంలో నెక్కుంది కొండలపై ఉన్న శ్రీఅగస్తీశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రథోత్సవం నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి పూలతో సుందరంగా అలంకరించారు. భక్తులు ఉత్సవమూర్తులపై మిరియాలు, ఉప్పు, పూలు చల్లి మొక్కులు చెల్లించారు. అంతకుముందు హోమపూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ రామనారాయణరెడ్డి పర్యవేక్షించారు. సీఐ రాఘవరెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.

మళ్లీ ప్రజా సంక్షేమ పాలనే లక్ష్యం





మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ, హాజరైన బూత్‌కమిటీ సభ్యులు

వి.కోట: రాబోవు ఎన్నికల్లో అందరూ సంఘటిత కృషి చేసి మరోసారి ప్రజా సంక్షేమ పాలన తెచ్చుకునేందుకు ప్రజలు వైఎస్సార్ సీపీకి పట్టం కట్టే లక్ష్యంతో ముందుకుపోవాలని ఎమ్మెల్యే వెంకటేగౌడ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని ఓ కళ్యాణ మండపంలో మండల బూత్ కమిటీ సభ్యులకు సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బూత్ కమిటీ సభ్యులు ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే గత టీడీపీ ప్రభుత్వం అవినీతి, దోపిడీని ఎండగట్టుతూ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో జగనన్న చేసిన మేలును వివరించాలని మార్గదర్శనం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ యువరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు ఎస్ఏ గౌస్, పీఎస్ నాగరాజు, మండల కన్వీనర్ బాల గురునాథ్, వైస్ ఎంపీపీ డాక్టర్ తమీమ్‌ఖాన్, నాయకులు ప్రతాప్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, వైస్ సర్పంచ్ అక్మల్, మండల బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.